దవాఖాన నుంచి ఇంటికి చేరిన మహేశ్

నెల రోజుల క్రితం సౌదీలో రోడ్డు ప్రమాదం • నడుము, కాళ్లు విరిగి అచేతన స్థితిలో ..

అండగా నిలిచిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ • స్వదేశానికి రప్పించి మెరుగైన వైద్యసాయం

దవాఖానకు రూ.9లక్షల బిల్లు చెల్లింపు • కేటీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం: మహేశ్, కుటుంబసభ్యులు

సిరిసిల్ల రూరల్, జూన్ 15: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండతో హైదరాబాద్‌లోని దవాఖానలో చికిత్సపొంది కోలుకున్న మంద మహేశ్ ఆదివారం ఇంటికి చేరుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం మండెపల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మంద మహేశ్ ఉపాధికోసం నిరుడు సౌదీ వెళ్లాడు. మే నెలలో సౌదీలో మహేశ్ ప్రయాణిస్తున్న కారును ఓ వాహనం ఢీకొట్టింది. వాహనంలోని 8 మంది అక్కడిక్కడే మృతిచెందగా, మహేశ్ నడుము, కాళ్లు విరిగి అచేతన స్థితిలో సౌదీలోని దవాఖానలో చేరాడు. సెల్ఫీ వీడియో ద్వారా తన దయనీయస్థితిని వివరిస్తూ కేటీఆర్‌ను వేడుకోగా ఆయన స్పందించి ఇండియన్ ఎంబసీ అధికారులతో మాట్లాడి, స్వదేశానికి రప్పించేందుకు ఏర్పాటు చేశారు. మే 11న మండెపల్లిలో మహేశ్ కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని చెప్పారు. నాలుగు రోజుల్లో స్వదేశానికి రప్పించి హైదరాబాద్ ఎయిర్‌పోర్టు నుంచే నేరుగా కిమ్స్ దవాఖానకు తరలించారు. కేటీఆర్ కిమ్స్ వైద్యులు మహేశ్ ఎడమకాలుకు శస్త్ర చికిత్సతో పాటు ఇతర క్రిటికల్ సేవలను 20 రోజుల పాటు అందించారు. దవాఖాన బిల్లు రూ.9 లక్షలు కేటీఆర్ చెల్లించడంతో రెండు రోజుల క్రితం డిశ్చార్జయి ఇంటికి చేరాడు. తనకు అండగా నిలిచిన కేటీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటామని మహేశ్, కుటుంబసభ్యులు తెలిపారు. మహేశ్‌కు భార్య లక్ష్మితోపాటు కూతురు నిత్యశ్రీ, కొడుకు హర్షవర్ధన్ ఉన్నారు.

కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న మహేశ్, భార్య, పిల్లలు

యువత రాజకీయాల్లోకి రావాలి

- **డీలిమిటేషన్ కారణంగా 153 అసెంబ్లీ స్థానాలు పెరుగుతాయి**
- **బీసీలకు 42% రిజర్వేషన్లు ఇచ్చేంతవరకు ఉద్యమిస్తాం**
- **'లీడర్' పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

హైదరాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ): యువత రాజకీయాల్లోకి వస్తే స్వచ్ఛమైన రాజకీయాలకు నాంది పడుతుందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో 'లీడర్' పేరుతో నాయకత్వ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఆదివారం ఆమె బంజారాహిల్స్‌లోని తన నివాసంలో 'లీడర్' శిక్షణ కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. ఏ రాజకీయ నేపథ్యం లేని వారికి, యువతకు, మహిళలకు తెలంగాణ జాగృతి ఒక రాజకీయ శిక్షణ వేదికగా మారబోతున్నదని చెప్పారు.. తెలంగాణ గడ్డ అంటేనే ప్రశ్నించేతత్వం అని పేర్కొన్నారు.

ప్రతి నెలా శిక్షణా తరగతులు

తెలంగాణ వ్యాప్తంగా ప్రతి నెలా మూడు రోజులపాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తామని ఎమ్మెల్సీ కవిత చెప్పారు. జూలైలో హైదరాబాద్‌లో ప్రారంభించి.. ఆగస్టు నుంచి జిల్లాల్లో నిర్వహిస్తామని, ఇవి నిరంతరం కొనసాగుతాయని వివరించారు. ప్రజాస్వామ్యంపై ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ శిక్షణా తరగతుల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. డీలిమిటేషన్‌తో 153 అసెంబ్లీ స్థానాలతోపాటు ఎంపీ స్థానాలు కూడా పెరుగుతాయని చెప్పారు. మహిళా రిజర్వేషన్ చట్టం వచ్చిన నేపథ్యంలో రాబోయే పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలకు 33% మహిళా అభ్యర్థులు తయారుకావాల్సిన అవసరం ఉంటుందని చెప్పారు. మహిళా రిజర్వేషన్, బీసీ రిజర్వేషన్ బిల్లుల ఆమోదంలో తెలంగాణ జాగృతి కీలక పాత్ర పోషించిందని కవిత గుర్తుచేశారు. బీసీలకు 42% రిజర్వేషన్లు వచ్చేవరకు ఉద్యమిస్తామని స్పష్టంచేశారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కవిత

పైసల్లేవు.. ప్రకటనే భరోసా

మొదటిపేజీ తరువాయి...

16వ తేదీ నుంచే ప్రభుత్వం రైతు భరోసా సాయాన్ని పంపిణీ చేస్తుందన్న ప్రచారం జరిగింది. కానీ వాస్తవ పరిస్థితులు మాత్రం అందుకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. ఈ నెలా ఖరు నుంచి పంపిణీ చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు సమాచారం.

కత్తి మీద సాములా నిధుల సమీకరణ

రేవంత్‌రెడ్డి సర్కారు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. బయట రూపాయి కూడా అప్పు పుట్టే పరిస్థితి లేదని స్వయంగా ముఖ్యమంత్రే చెప్పారు. ఈ నేపథ్యంలో రైతు భరోసాకు నిధులు సమకూర్చడం కత్తిమీద సాములా మారింది. ఈ సీజన్‌లో సుమారు 70 లక్షల మంది రైతులకు సంబంధించిన 153 లక్షల ఎకరాలకు రైతుభరోసా సాయాన్ని పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఎకరానికి రూ. 6 వేల చొప్పున సుమారు రూ. 9,200 కోట్ల నిధులు అవసరం అవుతాయి. దీనికి తోడు గత యాసంగికి సంబంధించి ఇంకా రూ. 4 వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. అంటే మొత్తం రైతుభరోసా కోసం రూ. 13,200 కోట్లు అవసరం. ఇంత భారీ మొత్తం జమ చేయడం అసాధ్యమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కనీసం ఈ సీజన్‌కు అవసరమైన రూ. 9,200 కోట్లయినా సమకూర్చగలుగుతుందా అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

సర్పంచ్ ఎన్నికలే ఎజెండా

రైతుభరోసా వెనుక ప్రభుత్వం సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఎజెండాను సెట్ చేసినట్టు తెలిసింది. ఈ నెలాఖరు నాటికి జడ్పీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఇదే నిజమైతే రైతుభరోసా డబ్బులు రైతుల ఖాతాల్లో పడిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని సర్కారు భావిస్తున్నది. లేనిపక్షంలో రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదన్న భయం వేధిస్తున్నది. ఈ నేపథ్యంలో 20వ తేదీ తర్వాత రైతుభరోసా పంపిణీని ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్టు తెలిసింది. ఒకవేళ పంచాయతీ ఎన్నికల్లో ఏమైనా మార్పులు చేర్పులు జరిగితే రైతుభరోసా పంపిణీ తేదీ నిర్ణయం కూడా వాయిదా పడడం ఖాయమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కేసీఆర్ కట్టించిన రైతు వేదికల్లో రేవంత్ సర్కారు పండుగ!

- **2,601 రైతు వేదికల్ని కట్టించిన నాటి సీఎం కేసీఆర్**
- **ఇప్పుడు వాటిలో రేవంత్ సర్కారు 'రైతు నేస్తం' ప్రోగ్రాం**
- **పైసా ఇవ్వకుండా సౌకర్యాలు కల్పించాలని ఏఈవోలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశాలు**
- **ఫ్లెక్సీలు, టీ, టిఫిన్ల ఖర్చుల భారమంతా ఏఈవోలపైనే**
- **తామెక్కడ తేవాలని ఆగ్రహం**

హైదరాబాద్, జూన్ 15(నమస్తే తెలంగాణ): రైతుల మేలు కోసం మాజీ సీఎం కేసీఆర్ చేసిన పనులు ఫలితాన్నిస్తున్నాయి. నాడు రైతులను సంఘటితం చేసేందుకు, వ్యవసాయ నూతన విధానాలను వారికి చేరవేసేందుకు ఆయన నిర్మించిన రైతు వేదికలు ఇప్పుడు వారికి మేలు చేస్తున్నాయి. ఇప్పుడా వేదికల్లో కాంగ్రెస్ సర్కారు పండగ చేస్తున్నది. 1,304 రైతు వేదికల్లో రైతునేస్తం కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ప్రారంభించనున్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు, అధికారులు రైతులకు సాగు మెళకువలు, సలహాలు, సూచనలు ఇవ్వనున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి సీఎం రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే ప్రారంభం

వాస్తవానికి ఈ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ సర్కారు గతంలోనే ప్రారంభించింది. తొలిదశలో 130 రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సదుపాయాన్ని కల్పించింది. ప్రతి రైతు వేదికలో టీవీ, నెట్ కనెక్షన్ కల్పించి రైతులకు వీడియో సందేశం ద్వారా సూచనలు, సలహాలను అందించడం ప్రారంభించింది. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని 2,061 రైతువేదికల్లోనూ అమలు చేయాలని నిర్ణయించి కార్యాచరణ కూడా ప్రారంభించింది. అయితే అంతలోనే ఎన్నికలు రావడం, కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి రావడంతో అది నిలిచిపోయింది. నాటి బీఆర్ఎస్ ప్రణాళికను ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు అమలు చేస్తున్నది.

పైసా లేకున్నా ఫంక్షన్ మాత్రం ఘనంగా

సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించబోయే రైతునేస్తం కార్యక్రమానికి సంబంధించి అన్ని రైతువేదికల్లో ఘనంగా ఏర్పాట్లు చేయాలని ఏఈవోలకు ఆదేశాలు వెళ్లాయి. ప్రతి రైతు వేదికలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, వందల సంఖ్యలో రైతులను సమీకరించాలని, వీడియో కాన్ఫరెన్స్ వీక్షించేలా టెంట్లు, కుర్చీలు ఏర్పాటు చేయాలని, కార్యక్రమానికి వచ్చిన రైతులకు తాగునీరు, టీ వంటి ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీచేశారు. అంతా బాగానే ఉన్నా ఇందుకోసం ఏఈవోలకు నయా పైసా కూడా ఇవ్వలేదు. నిధులు ఇవ్వకుండా ఏర్పాట్లు మాత్రం ఘనంగా ఉండాలంటే ఎలా అని ఏఈవోలు ప్రశ్నిస్తున్నారు. దీంతో స్పందించిన వ్యవసాయ శాఖ మొక్కుబడిగా ప్రతి రైతు వేదికకు రూ. 5 వేల చొప్పున కేటాయించినట్టు తెలిసింది. ఇందుకు సంబంధించి ఆదివారం రాత్రి సర్క్యులర్ జారీచేసింది. అయితే ఈ నిధులను ఎప్పుడు విడుదల చేస్తామనే అంశంపై మాత్రం స్పష్టత ఇవ్వకపోవడం గమనార్హం. దీంతో సోమవారం నాటి ఖర్చులను ఏఈవోలే తమ జేబుల్లోంచి పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రైతులకు ఒక వేదిక ఉండాలనే

గ్రామాల్లో రైతులను ఒక చోట చేర్చి వారికి వ్యవసాయ సంబంధిత అంశాలు వివరించేందుకు సరైన వేదిక కరువైంది. ఈ పరిస్థితుల్లో రైతులకు ఒక వేదిక కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా రైతువేదిక పేరుతో ప్రాంగణాల నిర్మాణాన్ని చేపట్టారు. ప్రతి ఐదువేల ఎకరాలను ఒక క్లస్టర్‌గా విభజించి ప్రతి క్లస్టర్‌కు ఒక రైతువేదిక చొప్పున 2,601 రైతు వేదికల్ని నిర్మించారు. ఒక్కో రైతు వేదిక కోసం రూ. 22 లక్షల చొప్పున రూ. 572 కోట్లు వెచ్చించారు. దీంతో పాటు ప్రతి క్లస్టర్‌కు ఒక ఏఈవోను నియమించి వ్యవసాయ సేవల్ని రైతులకు మరింత చేరువ చేసే ప్రయత్నం చేశారు.

బీఏఎస్ పాఠశాలల బకాయిలు ఎప్పుడిస్తరు?

బీఏఎస్ఎంఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరన్న, శేఖర్‌రావు

ఖైరతాబాద్, జూన్ 15 : రాష్ట్రంలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాలల(బీఏఎస్)బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారని ఆ పాఠశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీరన్న, శేఖర్‌రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. బీఏఎస్ పాఠశాలలు దైన్యస్థితిలో ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 180 బీఏఎస్ స్కూళ్లు ఉండగా.. వాటిలో దళిత విద్యార్థులు 19 వేలు, గిరిజన విద్యార్థులు 7 వేల మంది చదువుతున్నట్టు తెలిపారు. డేస్కాలర్ ఒకటో తరగతి ఎస్సీ విద్యార్థులకు రూ.28 వేలు, రెసిడెన్షియల్ విద్యార్థులకు రూ.42 వేలు, ఎస్టీ విద్యార్థులకు 3,5,8 తరగతుల వారికి రూ.42 వేల చొప్పున ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందిస్తుందని, ఈ డబ్బుతో యాజమాన్యం ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య, భోజనం, యూనిఫాం, పుస్తకాలతోపాటు వసతి కల్పిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత నిధులు విడుదల కాలేదని, సుమారు రూ.210 కోట్లు పెండింగ్ ఉన్నట్టు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేయాలని, లేకుంటే పాఠశాలలను నిర్వహించలేమని స్పష్టంచేశారు. అసోసియేషన్ ఉపాధ్యక్షులు బీచుపల్లి, జయసింహగౌడ్, కోశాధికారి లింగారెడ్డి, సలహాదారు రాయిరెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శేఖర్‌రావు

ప్రాజెక్టులకు కొనసాగుతున్న వరద

అయిజ/మోర్తాడ్, జూన్ 15 : కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వానలకు జూరాల, తుంగభద్ర ప్రాజెక్టులకు వరద కొనసాగుతున్నది. ఆదివారం జూరాల ప్రాజెక్టుకు 20వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, అవుట్‌ఫ్లో 21,677 క్యూసెక్కులు నమోదైంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 318.516 అడుగులు కాగా, ప్రస్తుతం 316.550 అడుగుల నీటిమట్టం ఉన్నది. తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో 8,585 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 178 క్యూసెక్కులు నమోదైంది. గరిష్ఠ నీటిమట్టం1633 అడుగులకుగాను ప్రస్తుతం 1603.82 అడుగుల నీటిమట్టం ఉంది. నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఆదివారం 2,083 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చినట్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 1091అడుగులకు 1063.20 అడుగుల నీరు నిల్వ ఉన్నది.

బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లో ప్రభుత్వ స్థలం చుట్టూ బ్లూషీట్స్ వేస్తున్న దృశ్యం

ఖరీదైన ప్రభుత్వ స్థలం ఆక్రమణ

- **కమాండ్ కంట్రోల్‌సమీపంలో..**
- **బ్లూషీట్లు వేసిన ప్రైవేటు వ్యక్తులు**
- **కోర్టు తీర్పు ఉందని బుకాయింపు**
- **అవి ఉనికిలో లేని సర్వేనంబర్లని తహసీల్దార్ అనితారెడ్డి ప్రకటన**

బంజారాహిల్స్,జూన్ 15: అది హైదరాబాద్ మహానగరం.. బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఖరీదైన ప్రభుత్వ స్థలం.. కూతవేటు దూరంలోనే పోలీస్ కమాండ్ కంట్రోల్ కార్యాలయం.. ఆ స్థలాన్ని యథేచ్ఛగా ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించేశారు.. ఇది ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. షేక్‌పేట మండలం సర్వేనంబర్-403లోకి వచ్చే టీఎస్ నంబర్ 5, బ్లాక్ హెచ్, వార్డు 10లో సుమారు 2,000 గజాల ప్రభుత్వ స్థలం అక్కడ ఖాళీగా ఉన్నది. తెలంగాణ భవన్ ముందు నుంచి రోడ్ నం.12కు కొత్తగా వేసిన లింక్ రోడ్డుకు ఒకవైపు పోలీస్ కమాండ్ కంట్రోల్ భవనం ఉండగా, రెండో వైపున ఉన్న ఈ ఖాళీ స్థలంలో గతంలోనే రెవెన్యూ అధికారులు ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేశారు. ఈ స్థలం తమదంటూ గతంలో కొందరు ప్రైవేటు వ్యక్తులు ఆక్రమణలకు ప్రయత్నించగా రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. ఈ స్థలంతో కలిపి మొత్తం 2,000 గజాల ప్రభుత్వ స్థలం ఖాళీగా ఉన్నదని, ఈ స్థలం విలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.60 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో బౌన్సర్లు, ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందితో వచ్చిన వ్యక్తులు సుమారు 1,000 గజాల స్థలంలోకి ప్రవేశించారు. ఆ స్థలంలోని ప్రభుత్వ హెచ్చరిక బోర్డును తొలగించారు. దానిచుట్టూ గుంతలు తవ్వి కాంక్రీట్ పూడ్చి, చుట్టూ బ్లూషీట్స్ వేశారు. వారిని కొందరు స్థానికులు ప్రశ్నించగా, ఈ స్థలం పవన్‌కుమార్ అనే వ్యక్తిదని ఈ స్థలంలోకి రెవెన్యూ అధికారులు ప్రవేశించకుండా హైకోర్టులో ఉత్తర్వులు ఉన్నాయంటూ దబాయించారు. సర్వే నంబర్ 129/104(ఓల్డ్)(403/53న్యూ)లోకి వచ్చే ఈ స్థలాన్ని తమ తండ్రి 1967లో కొనుగోలు చేశాడని, దీన్ని తన పేరుతో 1987లో గిఫ్ట్ డీడ్ చేయగా, అప్పటినుంచి తమ ఆధీనంలోనే ఉన్నదంటూ పవన్‌కుమార్ తెలిపారు. తమను రెవెన్యూ సిబ్బంది ఇబ్బందిపెడ్తూ ఫెన్సింగ్ వేసుకోనివ్వకపోవడంతో హైకోర్టులో కేసు వేసి ఆదేశాలు తెచ్చుకున్నామని పేర్కొన్నారు.

ఉనికిలో లేని సర్వేనంబర్‌తో ఆదేశాలు: తహసీల్దార్

బంజారాహిల్స్ రోడ్ నం.12లోని కమాండ్ కంట్రోల్ పక్కనున్న 2,000 గజాలు రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ స్థలంగా ఉన్నదని, ఇదంతా సర్వేనంబర్ 403లోకి వస్తుందని షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి తెలిపారు. ఈ స్థలం సర్వే నంబర్ 129/104(ఓల్డ్)లోనిది అంటూ కొందరు ఈ స్థలంపై కోర్టు ఆదేశాలు తెచ్చినట్టు తమ దృష్టికి వచ్చిందని, కోర్టు తీర్పులో పేర్కొన్న సర్వే నంబర్ ఉనికిలో లేదని ఆమె తెలిపారు. బ్లూషీట్లు వేసుకున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, కోర్టు ఆదేశాలను పరిశీలించి నోటీసులు ఇచ్చి ఆక్రమణలను తొలగిస్తామని తెలిపారు.

మరో ఆటోడ్రైవర్ ఆత్మహత్య

- **ఆర్థిక ఇబ్బందులు తాళలేక సూసైడ్**
- **నారాయణగూడలోని విఠల్‌వాడిలో ఘటన**

హిమాయత్‌నగర్, జూన్ 15 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తీసుకొచ్చిన 'మహిళలకు ఉచిత బస్సు' పథకం ఆటోడ్రైవర్ల పాలిట శాపంగా మారింది. తాజాగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న ఓ ఆటోడ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నారాయణగూడ పరిధిలో చోటుచేసుకున్నది. అడ్మిన్ ఎస్సై నాగరాజు తెలిపిన వివరాలు.. విఠల్‌వాడిలో కోటేశ్వర్(50)తన కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. వృత్తిరీత్యా ఆటో నడుపుతూ జీవనోపాధి పొందుతున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆటోతో సరైన ఉపాధి లభించకపోవడంతో కుటుంబాన్ని పోషించలేని పరిస్థితిలో మానసికంగా కుంగిపోతున్నాడు. ఈ నెల 10న అతని కుటుంబ సభ్యులు పని మీద బయటకు వెళ్లినప్పుడు.. అప్పటికే కొనుగోలు చేసిన పురుగుల మందు సేవించి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు తిరిగి వచ్చాక గమనించి ఉస్మానియా దవఖానకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

దళిత గిరిజన విద్యార్థులకు ధోకా?

- **బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌లో రూ.210 కోట్లు బకాయిలు**
- **స్కీమ్ అమలుకు పాఠశాల యాజమాన్యాల నిరాకరణ**
- **ఈ విద్యాసంవత్సరం అడ్మిషన్లు ఇవ్వబోమని స్పష్టీకరణ**
- **దిక్కుతోచని 25 వేల మంది దళిత, గిరిజన విద్యార్థులు**

హైదరాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలో బెస్ట్ అవైలబుల్ స్కీమ్ (బీఏఎస్) పథకం కూడా ప్రశ్నార్థకంగా మారింది. ప్రైవేట్ స్కూళ్లకు సర్కారు రూ. 210 కోట్లు బాకీపడింది. నిధులు చెల్లించకుండా పథకం అమలు చేయడం కుదరదని పాఠశాల యాజమాన్యాలు స్పష్టంచేశాయి. దీంతో 25వేల మంది విద్యార్థుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందని, ప్రభుత్వం నుంచి స్పందన కరువైందని, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తలు మండిపడుతున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం.. విద్యపై నిర్లక్ష్యం

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యను ఉచిత అందించడం కోసం 17 ఏండ్లుగా ప్రభుత్వాలు బెస్ట్ అవైలబుల్ స్కూల్' స్కీమ్ అమలు చేస్తున్నాయి. ఈ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖలు నోటిఫికేషన్ జారీచేసి, విద్యార్థులను ఎంపిక చేసి, అదే జిల్లాలోని ప్రైవేట్ స్కూళ్లల్లో చదివిస్తాయి. ఎస్సీ విద్యార్థులకు 1వ, 5వ తరగతిలో, ఎస్టీ విద్యార్థులకు 1వ, 5వ, 8వ తరగతుల్లో ప్రభుత్వమే ప్రవేశాలు కల్పిస్తుంది. ఒక సారి ప్రవేశం పొందితే పదో తరగతి వరకు వారి ఫీజులు చెల్లిస్తుంది. ప్రాథమిక పాఠశాల విద్యార్థికి ఏడాదికి రూ.28,000లు, ఉన్నత పాఠశాల విద్యార్థికి ఏడాదికి, వసతితో కలిపి రూ.42,000లు చెల్లిస్తుంది. పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, స్కూల్ యూనిఫాం ఉచితంగా అందిస్తుంది. ఇప్పటికే ఈ స్కీమ్ కింద 17వేల మంది ఎస్సీ, 8వేల మంది ఎస్టీ విద్యార్థులు వివిధ తరగతుల్లో చదువుకుంటున్నారు.

ఏడాదిన్నరగా చెల్లింపులు సున్నా

బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌కు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిన్నరగా ప్రైవేటు పాఠశాలలకు రూ.210కోట్ల నిధులను చెల్లించకుండా బకాయిలు పెట్టింది. ప్రైవేట్ పాఠశాలల యజమానులు చాలాసార్లు ప్రభుత్వ పెద్దలను కలిసి, ఫీజులు చెల్లించాలని కోరారు. కానీ ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. గతంలో అడ్మిషన్ పొందిన విద్యార్థులను స్కూల్స్, హాస్టల్స్ నుంచి పంపించాలని నిర్ణయించారు.

బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలు

సంవత్సరం	బకాయిలు
2022-23	రూ.10కోట్లు
2023-24	రూ.75కోట్లు
2024-25	రూ.125 కోట్లు
మొత్తం	రూ.210కోట్లు

నిధులివ్వకుంటే అడ్మిషన్లు తీసుకోం

బెస్ట్ అవలైబుల్ స్కీమ్ నిధులను ప్రభుత్వం బకాయి పెట్టింది. ఆర్థిక ఇబ్బందులతో పాఠశాలలను నిర్వహించలేకపోతున్నాం. ప్రభుత్వ పెద్దలను ఎన్నిసార్లు కలిసి విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయింది. అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం తక్షణం నిధులను విడుదల చేయకుంటే ఈ విద్యాసంవత్సరం నుంచి ఈ స్కీమ్ కింద అడ్మిషన్లను తీసుకునే ప్రసక్తే లేదు.

–శేఖర్‌రావు, బీఏఎస్ పాఠశాలల సంఘం రాష్ట్ర కార్యదర్శి

నిర్మల్ జిల్లాలో కిడ్నాప్ కలకలం

- **ఆదిలాబాద్ డీసీసీబీ డైరెక్టర్‌ను కిడ్నాప్ చేసిన ఆగంతకులు**
- **తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద తప్పించుకున్న హరీశ్**
- **కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

హరీశ్

నిర్మల్ అర్బన్/తూప్రాన్, జూన్ 15 : ఉమ్మడి ఆదిలాబాద్ కేంద్ర సహకార బ్యాంక్ డైరెక్టర్, బీఆర్ఎస్ నాయకుడు చిక్యాల హరీశ్ కిడ్నాప్ ఘటన నిర్మల్, మెదక్ జిల్లాల్లో కలకలం రేపింది. మెదక్ జిల్లా తూప్రాన్ ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా మామడ మండలం పొన్కల్ గ్రామానికి చెందిన హరీశ్ పొన్కల్‌లో శనివారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఇంట్లో నిద్రిస్తుండగా లేపి అతడి ఇన్నోవా వాహనంలోనే కొందరు దుండగులు కిడ్నాప్ చేశారు. హైదరాబాద్‌వైపు తరలిస్తుండగా మెదక్ జిల్లా తూప్రాన్ టోల్‌ప్లాజా వద్దకు రాగానే హరీశ్‌కుమార్ కారులోంచి దూకి తప్పించుకోగా.. కిడ్నాపర్లు అక్కడి నుంచి పరారయ్యారు. హరీశ్ వెంటనే తూప్రాన్ పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి ఆయనను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం హరీశ్‌ను తూప్రాన్ ఎస్ఐ-2 యాదగిరి నిర్మల్ పోలీసులకు అప్పగించారు. నిర్మల్ పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతానికి నలుగురు బలి

- **కోరుట్లలో గణపతి విగ్రహం తరలిస్తుండగా ఇద్దరు**
- **సాగర్‌రింగ్ రోడ్డులో విద్యుత్తు తీగలు తెగి పడటంతో ఇద్దరు యాచకుల దుర్మరణం**

వినోద్, సాయికుమార్ (ఫైల్)

కోరుట్ల/మన్సూరాబాద్, జూన్ 15: వేర్వేరు చోట్ల జరిగిన విద్యుత్తు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం చెందారు. గణపతి విగ్రహం విద్యుత్తు తీగలకు తగలడంతో జగిత్యాల జిల్లా కోరుట్లలో ఇద్దరు, హైదరాబాద్ శివారులోని సాగర్ రింగ్‌రోడ్డు వద్ద 11కేవీ విద్యుత్తు తీగలు తెగిపడటంతో ఇద్దరు యాచకులు అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... కోరుట్ల పట్టణంలోని మెట్‌పల్లి రోడ్డులో శ్రీబాలాజీ వినాయక విగ్రహాల తయారీ కేంద్రాన్ని అల్వాల వినోద్ నిర్వహిస్తున్నాడు